ఊరికి చేరేదెలా..?

- వాగు ఉప్పొంగితే రాకపోకలకు అంతరాయం
- గిరిజనులకు తప్పని తిప్పలు
- వంతెనలు నిర్మించాలని వేడుకోలు


గోర్యాగూడ వాగును దాటుతున్న ప్రజలు

కెరమెరి: మూడు వాగులు అనేక గ్రామాలు.. వెరసి ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. వాగులు పొంగి పొర్లితే ఇక వారు బాహ్య ప్రపంచానికి దూరమే. కెరమెరి మండలంలో వైశ్యాలంలో అతి పెద్దగా ఉండడం.. రవాణా సౌకర్యాలు సరిగా లేక పోవడంతో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఇక వర్షాకాలం వస్తే వారి కష్టాలు వర్ణణాతీతం.

సమస్యల్లో గిరిజన గ్రామాలు..
మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో , కరంజీవాడ, గోర్యగూడ, ఖైరీ, వాగులు పొంగి ప్రవహించడం వల్ల జన్కాపూర్, కరంజీవాడ, ఆంద్‌గూడ, బోరిలాల్‌గూడ, శంకర్‌లొద్ది, చిన్న ఖైరీ, ఇంద్రానగర్, నవేగాం, ఆగర్‌వాడ, నీంగూడ, ఇందాపూర్, నాగల్‌గొంది గ్రామాలు మొత్తం 400 కుటుంబాలు ఉన్నాయి. అందులో సుమారు 1800 జనాభా జీవిస్తున్నారు. వాగులపై వంతెనలు లేక ప్రజలు అనేక ఇబ్బంది పడుతున్నారు. ఒక్కసారి వర్షం కురిస్తే రోజుల తరబడి వాగుల ఉధృతి తగ్గదు. వారికి ఏ సరుకు, ఏ వస్తువు కావాలన్నా కెరమెరికి రాక తప్పదు కానీ వాగులు ఉప్పొంగితే కష్టాలకు అంతులేకుండా పోతుంది.

పట్టించుకోని అధికారులు
ఎందరో రాజకీయ నాయకులు మారుతున్నా.. గిరిజన గ్రామాల ప్రజల తలరాతలు మారడం లేదు. వచ్చిన ప్రతీ నాయకుడిని వాగుపై వంతెన నిర్మించండి అని వేడుకుంటున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. కొన్ని సందర్భంలో వాగులపై వంతెనలు నిర్మించాలని అధికారులను నిలదీసిన సందర్భాలు ఉన్నాయి. ఎన్నికలప్పుడు అమలు కాని హామీలు ఇచ్చి తరువాత విస్మరించారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



గతంలో చాలాసార్లు ఖైరీ వాగుపై వంతెన నిర్మాంచాలని అధికారులను వేడుకున్నాం. కాని ఎలాంటి ఉపయోగం లేదు. ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రేషన్ సరుకులతో పాటు నిత్యావసర వస్తువులు తీసుకరావాలన్నా తిప్పలు తప్పడం లేదు.

– విజయలక్ష్మి, మాజీ సర్పంచ్, ఖైరీ

అసంపూర్తిగా పాఠశాల భవనాలు

- శిథిల భవనంలోనే పాఠశాల నిర్వహణ
- బాబాసాగర్ జిల్లా పరిషత్ పాఠశాల దుస్థితి
- పట్టించుకోని అధికారులు


శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం

చింతలమానెపల్లి: మండలంలోని బాబాసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10 తరగతి వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాలలో 180 మంది విద్యార్థులు, 12 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. దాదాపు 50 సంవత్సరాల క్రితమే పాఠశాల ఏర్పాటు చేయగా.. నేటికి ఆ పాఠశాలలోనే విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. 12 ఏళ్ల క్రితం భవనాన్ని మంజూరు చేశారు. దీనిలో భాగంగా అదనపు గదులు నిర్మాణం చేశారు. అనంతరం అదనంగా నిధులు మంజూరు చేయగా పనులు ప్రారంభించారు. గదుల నిర్మించి పైకప్పు పూర్తి చేసి అసంపూర్తిగా వదిలేశారు. మరో వైపు మన ఊరు.. మనబడి పథకంలో పాఠశాలకు భోజనశాల, ఇతర గదులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ ఆరంభంలోనే పనులు నిర్వహించకుండా వదిలేశారు.

శిథిల భవనంలోనే స్టాఫ్ రూం..
పాఠశాలలో 5 తరగతులు నిర్వహిస్తుండగా పాఠశాల స్టాఫ్‌రూం, పాఠశాల కార్యాలయం, వంటగది, ప్రయోగశాలలు ఉన్నాయి. వీటిలో తరగతులకు గదులు సరిపోక పోవడంతో మొదటి అంతస్తులో అసంపూర్తిగా ఉన్న గదుల్లోనే 8, 7 తరగతులను నిర్వహిస్తున్నారు. మొదటి అంతస్తు వరండా గోడలు ప్రమాదకరంగా ఉండడంతో అడ్డుగా కర్రలు పెట్టి ఉంచారు. ఉపాధ్యాయుల కోసం స్టాఫ్‌రూం శిథిలావస్థలో ఉన్న భవనంలో నిర్వహిస్తున్నారు.

విద్యార్థులకు తప్పని తిప్పలు..
తరగతులు సరిపోకపోవడంతో పలుమార్లు విద్యార్థులకు చెట్లకిందే బోధన నిర్వహించాల్సిన పరిస్థితి. మరోవైపు అసంపూర్తి గదుల్లో బోధన కారణంగా వర్షాకాలంలో, ఎండాకాలంలో విద్యార్థులు వాతావరణ ప్రభావంతో ఇబ్బంది పడుతున్నారు. అసంపూర్తిగా ప్లాస్టరింగ్ చేయకుండా వదిలేసిన పైకప్పు పెచ్చులు ఊడుతోంది. దీంతో ప్రమాదాలు జరిగే పరిస్థితులు ఉన్నాయి. వంటగదిలో కనీసం సరుకులు కూడా నిల్వ ఉంచుకోలేక పోతున్నామని వంట నిర్వాహకులు వాపోతున్నారు.

అదనపు గదుల నిర్మాణం..
పాఠశాలలో ఇటీవల 26 లక్షల రూపాయల నిధులతో అదనపు గదుల నిర్మాణం ప్రారంభించారు. ఇవి నిర్మాణం పూర్తయి వినియోగంలోకి వస్తే విద్యార్థులకు సౌలభ్యంగా ఉంటుంది. గదుల నిర్మాణం సైతం పూర్తి చేస్తే ప్రజాధనం దుర్వినియోగం అరికట్టవచ్చని గ్రామస్తులు పేర్కొంటున్నారు. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించే దిశగా అధికారులు చర్యలు తీసుకుని పాఠశాలను అభివృద్ధి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

క్లుప్తంగా

అమ్మ దర్శనానికి బయలుదేరిన రైతులు


బయలుదేరిన సేంద్రియ రైతులు

కెరమెరి: మండలంలోని మహరాజ్‌గూడ అడవుల్లో కొలువైన జంగుబాయి దర్శనానికి మండలంలోని సేంద్రియ ఉత్పత్తిదారులు సంఘం ఆధ్వర్యంలో సేంద్రియ పంటలు పండించే రైతులు సోమవారం బయలుదేరారు. నేడు దర్శనానికి చివరి రోజు కావడంతో జంగుబాయి, టొప్లకస, సిద్దికస, రావుడ్, సోచమ్మ తల్లి దర్శించుకొనున్నట్లు రైతులు తెలిపారు. తెల్లని ధోతి, తెల్ల షర్టు ధరించి అందరు ముస్తాబై బయలుదేరారు. నాయకులు కేంద్రే బాలాజీ, న్యానేశ్వర్, రాంచందర్, రాము, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న ఉచిత గురుకుల కోచింగ్ పొందుతున్న విద్యార్థులకు సోమవారం స్వేరోస్ భక్తు నగేశ్, ఒంద్రె ప్రేమానందం నోటు బుక్కులు, పెన్నులు అందచేశారు. ఉచిత కోచింగ్ స ద్వినియోగం చేసుకుని గురుకులాల్లో సీట్లను సాధించాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎనగందుల తిరుపతి, ఉపాధ్యాయులు తిరుమల్, రవీందర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కెరమెరి: నీంగూడ గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. సోమవారం ఎమ్మెల్యే కోవలక్ష్మిని ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామానికి వెళ్లేందుకు సీసీ రోడ్డు వేయాలని, ఆలయ అభివృద్ధికి పాటుపాడాలన్నారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెందోర మోతిరాం, విట్టు, నగేశ్, అన్నారావు, సిరాజ్, సొనాజి పాల్గొన్నారు.

తప్పనిసరిగా మెనూ పాటించాలి


రికార్డులు పరిశీలిస్తున్న చంద్రశేఖర్

కెరమెరి: మెనూ తప్పనిసరిగా పాటించాలని కెరమెరి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని కెస్లాగూడ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరును పరిశీలించారు. విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెంచాలన్నారు. అందరికీ రాయడం, చదవడం రావాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. నాణ్యమైన భోజనం వడ్డించాలని, భోజనానికి ముందు టీచర్లు భోజనాన్ని పరిశీలించాలని సూచించారు. హెచ్‌ఎం శివప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సిర్పూర్(టి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో వివిధ తరగతుల్లో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకులాల డీసీవో శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీ లోపు అర్హులైన విద్యార్థులు తమ పూర్తి వివరాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్ డే



కేక్‌కట్ చేస్తున్న సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఎలక్ట్రీషియన్ డేను సోమవారం జిల్లా కేంద్రంలో పట్టణానికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. సర్‌థామస్ అల్వా ఎడిసన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మహ్మద్, మోయినొద్దీన్, గంగన్న, సురేశ్, సాయి, అంకూశ్, సంతోష్, పవన్ పాల్గొన్నారు.

అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి


నూతనంగా ఎన్నికైన సంఘం ప్రతినిధులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని వివిధ ఆలయాల్లో డీడీఎన్ పథకంలో పని చేస్తున్న అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన డీడీఎన్ జిల్లా సంఘం అధ్యక్షుడు ఒజ్జల శిరీష్ శర్మ అన్నారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఈఎస్‌ఐ కాలనీలోని హనుమాన్ ఆలయం ఆవరణలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగు సత్యనారాయణశర్మ, అధికార ప్రతినిధులు సుబ్బా మహేశ్, శంకర్‌శర్మల ఆధ్వర్యంలో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఒజ్జల శిరీష్‌శర్మ, ఉపాధ్యక్షుడిగా అంబేద శంకరయ్య, దేవర వినోద్, తొగిటి వెంకటేశ్వర్, గట్టు సాయిశర్మ, ప్రధాన కార్యదర్శిగా శ్రీనుశర్మ, సహాయ కార్యదర్శులుగా బాపుదేవ్ కులకర్ణి, మామిడిపల్లి నరేశ్, పరమేశ్వర్, శుభాష్‌చారి, కోశాధికారిగా దేవళ్ల శ్రీధర్, గౌరవ అధ్యక్షుడిగా ఇందారపు శంకర్ శర్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు సంతోష్‌శర్మ, అభయ్‌ఆచార్య, సతీష్, విజయ్, ముత్తన్న, తిరుపతిచారి, సత్యనారాయణ, వినాయక్, తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి క్రీడాపోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని బాలురు ఉన్నత పాఠశాలలో ఎంపీపీ కప్ కీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో సుభాష్ సోమవారం తెలిపారు. మాజీ ఎంపీపీ మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి 30 వరకు లోకల్ బాడి, ప్రైవేట్ స్కూల్ పాఠశాల విద్యార్థులు ఈ పోటీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

డైరీ ఆవిష్కరణ


డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఛాంబర్‌లో సోమవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రె తెలంగాణ అగ్రి డాక్టర్ అసోసియేషన్ డైరీ 2025ను వ్యవసాయాధికారి రావూరి శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ మిలింద్ కుమార్, ఏవోలు మంజుల, విజయ్‌కుమార్, దీప్తి, దిలీప్, వినయ్, యుగంధర్, గిరీశ్ పాల్గొన్నారు.

'నిరుపేదలకే మొదటి ప్రాధాన్యత'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లలో మొదటి ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు స్పష్టం చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ ఇళ్ల నమూనా నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులతో , అధికారులతో సమావేశం నిర్వహించారు. దంతన్‌పల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నాలుగు సంక్షేమ పథకాలను అమలు చేసిందని అర్హులైన వారికి వంద శాతం అందిస్తామన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వాంకిడి: నూతనంగా తీసుకువచ్చిన సీపీఎస్, యూపీఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు సోమవారం తహసీల్దార్ రియాజ్ అలీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు ఉప్రె వినేష్ మాట్లాడుతూ కొత్తగా తీసుకువచ్చిన పెన్షన్ విధానంతో ప్రభుత్వ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యవర్గ సభ్యులు గిర్మాజీ, స్వేత, ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెంచికల్‌పేట్: యూపీఎస్ గెజిట్ రద్దు చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు వినతిపత్రం అందచేశారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ నిర్మల, లక్ష్మి, సంతోష్, భాషా, ఈశ్వర్‌రావు, ధన్‌రాజ్, ప్రియాంక, తిరుమల, అయేషా, ఆత్మారామ్, అఫ్తాబ్, భాగ్యశ్రీ, ఉజ్వల, సాదియా పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్ విజయవంతం చేయండి'


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జననేత, ఎస్సీల వర్గీకరణ సాధకులు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రావడం యావత్ మాదిగ జాతికే గర్వకారణమని, ఎస్సీల వర్గీకరణను రాష్ట్రంలో త్వరగా అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు రేగుంట కేశవ్‌రామ్‌మాదిగ అన్నారు. సోమవారం మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ర్యాలీకి బీజేపీ నాయకులు అరిగెల నాగేశ్వరావ్ మద్దతు పలికారు. అదే విధంగా ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే వెయ్యి గొంతుకలు, లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రేగుంట మహేశ్, దూడల అశోక్, యశోద, సురేశ్, నరేశ్, నాగరాజు, శ్రీకాంత్, సాయి శంకర్, నాని పాల్గొన్నారు.

రెబ్బెన: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తలపెట్టిన వేల గొంతులు, లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా యువ నాయకులు జంగొపెల్లి రాజేష్ పిలుపునిచ్చారు. ఈసందర్భంగా సోమవారం నారాయణపూర్‌లో గ్రామ కమిటీని ఎన్నికున్నారు. కమిటీ అధ్యక్షుడిగా వేమునూరి పవన్ కళ్యాణ్, ఉపాధ్యక్షుడిగా వేమునూరి మధూకర్, అధికార ప్రతినిధిగా అయిల్ల మల్లేష్, సహాయ కార్యదర్శిగా వేమునూరి నవీన్, సలహాదారులుగా అయిల్ల తిరుపతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కెరమెరి: ఏబీసీడీ వర్గీకరణకు కొందరు కుట్రలు పన్నుతున్నారని వారికి భయపడేది లేదని ఎమ్మార్పీస్ మండలాధ్యక్షుడు పొర్ల వెంకటేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే 'లక్ష డప్పులు..వెయ్యి గొంతులు' ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గోగర్ల అశోక్, రాంచందర్, రాజయ్య, శ్రీనివాస్, చంద్రశేఖర్, సాయికుమార్, మహేశ్, నరసింహ పాల్గొన్నారు.

వైన్స్ షాప్‌లకు జరిమానా

సాక్షి ఎఫెక్ట్..


జరిమానా విధిస్తున్న కార్యదర్శి సాయికృష్ణ

కౌటాల: మండల కేంద్రంలోని బాలాజీ వైన్స్, శ్రీ వైష్ణవి వైన్స్ నిర్వాహకులకు కౌటాల గ్రామ పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ సోమవారం జరిమానా విధించారు. ఈనెల 4న 'సాక్షి' దినపత్రికలో 'ప్లాస్టిక్.. పరేషాన్' అనే కథనానికి అధికారులు సోమవారం స్పందించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ వినియోగించడంతో పాటు కాలనీలోని జనావాసాల మధ్యే ప్లాస్టిక్‌ను విచ్చల విడిగా పడేస్తున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో వైన్స్ షాపుకు రూ. 2500 చొప్పున జరిమానా విధించినట్లు సాయికృష్ణ తెలిపారు.

నిధుల కేటాయింపు పెంచాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఐసీడీఎస్‌ను వ్యవస్థీకృతం చేసేందుకు, క్రమబద్ధీకరణ కోసం, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు గ్రాట్యుటీ చెల్లింపు కోసం 2025- 26 వార్షిక బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు కేటాయింపులను పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం సరైన మౌలిక సదుపాయాలు, మానవ వనరులు కల్పించేందుకు తగిన ఆర్థిక కేటాయింపు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణమాచారి, అంజిలి, ఠాకూర్ వనిత, విజయలక్ష్మి, మల్లీశ్వరీ, ధనలక్ష్మి, అంబాకా, నీత, సూర్యమణి, వినోద, రత్నమాల, ఈశ్వరీ, సులోచన, లక్ష్మి పాల్గొన్నారు.

ఢిల్లీ వేడుకల్లో జయంతి రాణి


జయంతి రాణికి జ్ఞాపిక అందజేస్తున్న అధికారులు

కౌటాల: ఢిల్లీలో నిర్వహించిన 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కౌటాల మండలం కౌఠి అంగన్‌వాడీ టీచర్ జయంతి రాణి పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణ దేవి అంగన్‌వాటీ టీచర్ జయంతి రాణిని అభినందించారు. అనంతరం అధికారులు జ్ఞాపిక అందజేసి సన్మానించారు. గత 19 ఏళ్లుగా అంగన్‌వాడీ టీచర్ జయంతి రాణి తనే స్వయంగా హస్తకళలతో పలు రకాల బొమ్మలు తయారు చేసి పిల్లలకు పాఠాలు బోధిస్తున్నారు. పక్షులు, గృహాలు, పువ్వులు, జంతువులు, వాహనాలు బొమ్మలను తయారు చేసి వాటి జీవన విధానాలపై పిల్లలకు వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు విభిన్న రీతిలో బోధన అందిస్తున్నందుకు గాను పీఎం యశ్వసి పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం జయంతి రాణి సేవలను గుర్తించి ఢిల్లీ పరేడ్ ప్రత్యేకంగా ఆహ్వానించిన సంగతి తెలిసిందే. మారుమూల ప్రాంతం నుంచి ఢిల్లీ పరేడ్ వేడుకల్లో పాల్గొన్న జయంతిరాణి గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

రైతుల ఖాతాల్లో నగదు జమ

- నాగేపల్లి గ్రామ రైతులకు 'రైతుభరోసా'


సంక్షేమ పథకాల మంజూరు పత్రాలతో లబ్ధిదారులు

కౌటాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలుకు కౌటాల మండలం నాగేపల్లి గ్రామాన్ని అధికారులు ఎంపిక చేశారు. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా గ్రామంలో నాలుగు సంక్షేమ పథకాల అమలు కార్యక్రమాన్ని ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్, జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్ ప్రారంభించి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. గ్రామంలో 262 మందికి రైతు భరోసా, 43 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 35 మందికి కొత్త రేషన్‌కార్డులు, 195 మందికి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులుగా గుర్తించారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల అమలు కార్యక్రమానికి నాగేపల్లి గ్రామాన్ని ఎంపిక చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం గ్రామంలోని 262 మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా నగదు జమ అయినట్లు అధికారులు పేర్కొన్నారు.

అభ్యసన సామగ్రితో విద్యాబోధన చేయాలి


సామగ్రి అందజేస్తున్న ఎస్‌వో

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు ఉపాధ్యాయులు అభ్యసన సామగ్రితో విద్యాబోధన చేయాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. సోమవారం జిల్లాలో ఎంపికైన 105 పాఠశాలలకు అభ్యసన సామగ్రి అందజేశారు. తెలుగు, ఆంగ్లం గణితంలో కనీస అభ్యసన సామర్థ్యాలు వచ్చే విధంగా విద్యబోధన చేయాలన్నారు. త్వరగా విషయాన్ని గ్రహించి మంచి అభ్యసన ఫలితాలు సాధిస్తారన్నారు. కేజీబీవీలో అందించిన సైన్స్ గణితము కిట్స్ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో బుక్ డిపో మేనేజర్ ప్రకాశ్, రిసోర్స్ పర్సన్స్ శంకర్, రాజ కమలాకర్ రెడ్డి, రంగయ్య పాల్గొన్నారు.

సన్మానం


సన్మానిస్తున్న ఎంఈవో హన్మంతు, సిబ్బంది

కౌటాల: విధుల్లో ఉత్తమ సేవలు అందించిన కౌటాల మండల విద్య వనరుల కేంద్రం కార్యాలయంలో సీసీవోగా విధులు నిర్వర్తిస్తున్న కామ్రె సుమన్‌ను 76వ గణతంత్ర దినోత్సవం వేడుకల్లో ఉత్తమ ఉద్యోగి అవార్డును అందుకున్నారు. కాగా సోమవారం కౌటాల ఎంఈవో కార్యాలయంలో మండల విద్యాధికారి గావుడే హన్మంతు సన్మానించారు. నిబద్ధతో విధులు నిర్వహిస్తే గుర్తింపు వస్తుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ప్రకాశ్, లూలాజీ, దేవన్న, మహేశ్, బానయ్య, తదితరులు పాల్గొన్నారు.